సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 9 । ఫిబ్రవరి । 2025



సర్పంచుల చెక్‌పవర్ రద్దుకు కుట్ర

మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశాలతో మండలంలోని సర్పంచ్‌ల చెక్‌పవర్‌ను రద్దు చేయించేందుకు అధికారులు పావులు కదుపుతున్నారు. -8లో



ఎమ్మెల్యే X తెలుగుయువత అధ్యక్షుడు

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు మధ్య వర్గపోరు రోజురోజుకీ పెరిగిపోతోంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.220
రెండోరకం	రూ.120	రూ.170



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 49 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	-	-
సీబీ	680	715



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 740.240 కిలోలు

రైతుల గోడు పట్టదా?

- పెట్టుబడి సాయం ఉత్తిమాటేనా
- తొమ్మిది గంటలు విద్యుత్ మాట మరిచారా
- వ్యవసాయ కనెక్షన్ల గ్రౌండింగ్‌లో జాప్యమేల
- కొత్త పెన్షన్లు ఊసెత్తకుండా ఉన్నవాటిని తొలగిస్తారా
- కలెక్టర్ గైర్హాజరు బాధ్యతా రాహిత్యం అనిపించుకోదా
- జెడ్పీ సమావేశంలో ప్రభుత్వాన్ని నిలదీసిన సభ్యులు



సభలో పాల్గొన్న సభ్యులు



మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే సుధ, ఎమ్మెల్సీలు



ప్రజా సమస్యలపై సభ్యుల ఫిర్యాదులను ఆలకిస్తున్న జేసీ అదితిసింగ్, జెడ్పీ చైర్ పర్సన్ శారద

కడప సెవెన్‌రోడ్స్: ఎన్నికల హామీలు బుట్టదాఖలు చేయడమే కాకుండా జిల్లారైతుల గోడు సైతం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు దునుమాడారు. జెడ్పీ చైర్‌పర్సన్ జేష్ఠాది శారద అధ్యక్షతన శనివారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో కరువు, ఎంఎస్‌పీ, రోజుకు తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా, విద్యుత్ కనెక్షన్ల గ్రౌండింగ్ తదితర పలు సమస్యలను ప్రస్తావిస్తూ ప్రభుత్వ నిర్లిప్తతపై నిప్పులు చెరిగారు. రైతుల సంక్షేమానికి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేయగా, కూటమి ప్రభుత్వం వాటి తొలగింపుల పర్వానికి తెర లేపిందంటూ దుయ్యబట్టారు.

- జెడ్పీ సర్వసభ్య సమావేశానికి కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ హాజరు కాకపోవడంపై ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో అతి ముఖ్యమైన జెడ్పీ సర్వసభ్య సమావేశానికి రాకపోవడం పూర్తిగా కలెక్టర్ బాధ్యతా రాహిత్యమంటూ మండిపడ్డారు. జిల్లాలో కలెక్టర్, జేసీ జెడ్పీ సమావేశానికి హాజరు కాకపోవడం ఇదే ప్రథమమన్నారు. జిల్లా ఉన్నతాధికారులు రాకపోతే తాము సమస్యలు ఎవరికి చెప్పుకోవాలంటూ నిలదీశారు. డీఆర్‌సీ సమావేశాన్ని కాస్త డిస్ట్రిక్ట్ రివేంజ్ కమిటీ సమావేశంగా మార్చివేశారని ఆరోపించారు. కలెక్టర్, జేసీ వస్తున్నారో లేదో కూడా జెడ్పీ చైర్ పర్సన్‌కు సమాచారం ఇవ్వకపోవడం ఏమిటంటూ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి నిలదీశారు. సమస్యలు తెలుసుకుని ప్రభుత్వానికి నివేదించాల్సిన కలెక్టర్ రాకపోవడం విచారకరమన్నారు. జేసీని కూడా పంపకపోతే ఈ సమావేశం ఎందుకంటూ పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు నిలదీశారు. కోర్టు పని అంటూ గత సమావేశానికి కూడా కలెక్టర్ రాలేదని గుర్తు చేశారు. రెండవ శనివారం సెలవురోజు అయినప్పటికీ అధికారులంతా వచ్చారని, కలెక్టర్ మాత్రం ఎందుకు రాలేదంటూ నిలదీశారు. కనీసం జేసీ అయినా రాకపోతే సమావేశాన్ని బహిష్కరిస్తామంటూ స్పష్టం చేశారు. దీనిపై జెడ్పీ సీఈఓ ఓబులమ్మ మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ అరగంటలో హాజరవుతున్నారని, సభ్యులంతా సహకరించాలని కోరారు. ఈనెల 11 లోపు సమావేశం జరగాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కొద్దిసేపటికి జేసీ రావడంతో సమావేశం ప్రారంభమైంది. తొలుత సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఎందుకనో సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఇంత ముఖ్యమైన జెడ్పీ సమావేశానికి కూటమికి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎవరూ హాజరు కాకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి.
- తమ మండలంలోని గంగిరెడ్డిపల్లె గ్రామ పొలాలు వెబ్‌ల్యాండ్‌లో లేవని, ఈ సమస్యను పరిష్కరించాలని వీఎన్ పల్లె ఎంపీపీ రఘునాథరెడ్డి కోరారు. ఆయుష్ అధికారులు జెడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యేలా చూడాలని కో ఆప్షన్ సభ్యుడు కరీముల్లా కోరారు. ఖాజీపేటలోని షాదీఖానా బాడుగ డబ్బులను కాజేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పోరుమామిళ్ల జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ మాట్లాడుతూ తమ మండలంలో గుండెపోటు మరణాల సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గంటలోపు ఇంజెక్షన్ వేస్తామని ప్రభుత్వం ప్రకటించినా అమలుకు నోచుకోవడం లేదన్నారు. కార్డియాలజిస్టును నియమించాలన్నారు. సోషల్ ఆడిట్‌లో దోషిగా తేలితేనే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోవాలన్నారు. జలకళ కింద బోర్లు వేసినా మోటార్లు ఏర్పాటు చేయడం లేదని, ఒకవేళ మోటార్లు ఇచ్చినా విద్యుత్ కనెక్షన్లు లేవని ఆరోపించారు. వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ పాములూరు గ్రామంలో గోకులం మంజూరు చేస్తూ కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఇచ్చినా పనులు చేపట్టలేదన్నారు. చక్రాయపేట జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఏ తప్పు లేకున్నా 15 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారని, ఏపీఓ బాధ్యత ఉంటుంది కనుక వారిని కూడా తొలగించాలన్నారు.ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

ఎంఎస్‌పీ కన్నా అధిక ధర చెల్లించాలి: ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కరువు, తుపాను వంటి ప్రతికూల వైపరీత్యాల వల్ల జిల్లాలో పంటల దిగుబడి తగ్గిన నేపథ్యంలో కనీసమద్దతు ధర కన్నా ఎక్కువ చెల్లించి ప్రభుత్వమే వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. తక్షణమే కొనుగోళ్లు చేపట్టాలని, లేదంటే పంట దళారుల చేతుల్లోకి వెళ్లిపోతుందన్నారు. శనగ క్వింటాలుకు రూ. 5600తో కొనుగోలు చేస్తామని ప్రభుత్వం అంటోందని, కల్లాల్లోనే దళారులు రూ. 5600కు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. మద్దతు ధరలు కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుందంటూ వ్యవసాయ శాఖ జేడీ అయితా నాగేశ్వరరావు చెబుతుండగా విషయాన్ని పక్కదారి పట్టించవద్దంటూ ఎంపీ అభ్యంతరం చెప్పారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ. 370 కోట్లు మంజూరు చేసి ఎంఎస్‌పీ కంటే అదనంగా ఇచ్చి కడప, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో శనగ పంట కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అలా అదనపు ధర చెల్లించాలన్నారు. వ్యవసాయ కనెక్షన్ల వంద శాతం గ్రౌండింగ్ తక్షణమే పూర్తి చేయాలని కోరారు. కొత్త సర్వీసుల కోసం దరఖాస్తులకు ఆన్‌లైన్‌లో వెసులుబాటు కల్పించాలన్నారు. స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్లు సరఫరా చేయాలనే ఫిర్యాదులు తరచూ రైతుల నుంచి వస్తున్నాయన్నారు. సబ్‌స్టేషన్లకు స్థలం ఇచ్చిన దాతలను ఉద్యోగాల నుంచి తొలగించడం సరికాదన్నారు. జిల్లాలో 1600 మంది రైతులు డబ్బు చెల్లించినా ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వకపోవడం విచారకరమన్నారు. పీఎంజీఎస్‌వై నాల్గవ దశకు సంబంధించి మార్గదర్శకాలను సవరిస్తే ఎక్కువ గ్రామాలకు రోడ్డు కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుందని, ఈ మేరకు తీర్మానం ఆమోదించి ప్రభుత్వానికి పంపాలని కోరారు. పనులు మంజూరైన ప్రాంతాల్లో గతంలో సర్పంచులకు మానిటరింగ్ పవర్ ఉండేదని, కానీ నేడు నేరుగా డబ్బులు ఏజెన్సీ వెండర్ ఖాతాల్లోకి వెళుతున్నాయని తెలిపారు. సర్పంచుల పాత్ర ఏమి లేకుండా పోయిందని చెప్పారు. ఆరు నెలలకు ఒకసారి కొత్త పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. 50 ఏళ్లు దాటిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు ఎప్పటినుంచి కొత్త పెన్షన్లు ఇస్తారో మార్గదర్శకాలు వచ్చాయా? అంటూ డీఆర్‌డీఏ పీడీని ప్రశ్నించగా, రాలేదని ఆయన సమాధానం ఇచ్చారు.



- ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ శనగ, కంది, మిరప పూర్తిగా దెబ్బతిన్నాయని, పెట్టుబడిసాయం కింద ఇస్తామన్న రూ. 20 వేలు ప్రభుత్వం ఎందుకు ఇవ్వడం లేదంటూ నిలదీశారు.మైలవరం మండలం ఎం.కంబాలదిన్నె గ్రామంలో రైతులకు తెలియకుండానే వారి భూమిని కౌలుకు ఇచ్చారంటూ వీఆర్వోలు తప్పుడు రికార్డులు సృష్టిస్తున్నారన్నారు. భర్త చనిపోతే భార్యకు పెన్షన్ ఇస్తున్నారని ప్రభుత్వం అంటున్నప్పటికీ నవంబరుకు ముందు చనిపోయిన వారికి పెన్షన్ రావడం లేదని తెలిపారు. గుండ్లకుంటలోని జెడ్పీ హైస్కూలులో నాడు–నేడు కింద చేపట్టిన పనులు అర్ధాంతరంగా ఆగాయని, వాటిని పూర్తి చేయాలని కోరారు.



- బద్వేలు ఎమ్మెల్యే దాసరి సుధ మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో ఓపీ ఎక్కువగా ఉన్నప్పటికీ డాక్టర్ల కొరత వేధిస్తోందని తెలిపారు. ప్రస్తుతానికి డిప్యుటేషన్లపై వైద్యులను పంపాలన్నారు. 1998లో అట్లూరు క్రాస్‌రోడ్డు వెంకటాపురంలో షెడ్యూల్డ్ కులాల వారికి ఇచ్చిన ఇళ్ల మరమ్మతులకు డబ్బులు ఇవ్వాలన్నారు. గోపవరం మండలం పీపీ కుంటలో లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్లను ఇతర జిల్లాలకు చెందిన వారు ఆక్రమించారని, వారిని తక్షణమే ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సుమారు 200 మంది ఆక్రమణలకు పాల్పడిన మాట నిజమేనని, కలెక్టర్, ఎస్పీతో చర్చించి ఖాళీ చేయిస్తామని జేసీ బదులిచ్చారు.



- ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ నాడు–నేడు కింద పాఠశాలల్లో చేపట్టిన చిన్నచిన్న పనులు పూర్తి చేసి తరగతి గదులను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబులు కొన్ని పనిచేయడం లేదనే విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వాటిని గుర్తించి రిపేర్లు చేయడం ద్వారా వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని, వెంటనే పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా కడప బాలాజీనగర్‌లో ప్రజలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు.



- చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేష్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ రైతులకు రోజుకు తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తామని కూటమి నేతలు ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారని, ఇప్పుడు విద్యుత్ అధికారులు ఏడు గంటలు మాత్రమే సరఫరా చేస్తామంటున్నారని తెలిపారు. విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తారని తెలుస్తోందని, దీనిపై అధికారులు సమాధానం చెప్పాలంటూ ప్రశ్నించారు.ఆర్‌బీకేలను ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. వ్యవసాయ పరికరాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కమలాపురం ప్రభుత్వ ఆస్పత్రిలో గైనకాలజిస్టు, సర్జన్ లేరని, తగిన ఎక్విప్‌మెంట్ కూడా లేదన్నారు.

అక్రమ మైనింగ్ తక్షణం ఆపాలి

జెడ్పీ సమావేశంలో తీర్మానం

కడప సెవెన్‌రోడ్స్: పులివెందుల నియోజకవర్గంలోని వేముల, వేంపల్లె మండలాల్లో భారీ ఎత్తున జరుగుతున్న అక్రమ మైనింగ్ కార్యకలాపాలను తక్షణమే నిలుపుదల చేయించాలని కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని శనివారం జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. గత కొన్ని నెలలుగా ఈ మండలాల్లో పెద్ద ఎత్తున అక్రమమైనింగ్ కార్యకలాపాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. రోజూ కోట్లాది రూపాయలు విలువజేసే ముగ్గురాయిని అక్రమంగా తరలిస్తున్నారు. అక్రమ మైనింగ్ జరుగుతున్న బెరైటీస్ గనులకు లీజులు లేవు. అలాగే పర్యావరణ అనుమతులు అసలే లేవు. ఇందువల్ల సీనరేజ్ డీఎంఎఫ్‌రూపంలో ప్రభుత్వానికి రావాల్సిన కోట్ల రూపాయల ఆదాయం రాకుండా పోతోంది. సంక్రాంతి పండుగ సమయంలో జనవరి 13వ తేది రాత్రి టిఫెన్స్ కంపెనీకి సంబంధించిన ఐదు వేల టన్నుల బెరైటీస్ ఖనిజాన్ని కొన్ని వందల ట్రక్కులతో రాత్రికి రాత్రి దోపిడీ చేశారు. ఈ 5 వేల టన్నుల ఖనిజాన్ని గత 12 ఏళ్లుగా ఆ కంపెనీ కాపాడుకుంటూ వస్తోంది. హైకోర్టు, ఎన్‌సీఎల్‌టీ పరిధిలో కూడా ఉంది. మార్కెట్‌లో దీని విలువ రూ. 15 కోట్లకు పైమాటే. గత కొన్నినెలలుగా పలుమార్లు పోలీసులకు, మైనింగ్ అధికారులకు ఆ కంపెనీ ప్రతినిధులు ఫిర్యాదును చేసినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో జనవరి 13న రూ. 15 కోట్లు విలువజేసే బెరైటీస్ ఖనిజాన్ని అక్రమంగా తరలించుకుపోయారు. ఈ దోపిడీ సరిపోదన్నట్లుగా టిఫెన్స్ కంపెనీ గనుల పక్కన ఎలాంటి అనుమతులు లేని అంజప్ప, అశోకప్ప గనుల ద్వారా బిలో ద సర్ఫేస్ నుంచి టిఫెన్స్ గనిలోకి ప్రవేశించి ప్రతిరోజు సుమారు రూ. కోటి రాయిని తరలిస్తున్నారు. ఈ అక్రమ మైనింగ్ నేపథ్యంలో ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీ,సీనరేజ్, డీఎంఎఫ్ నిధులు రాకుండా పోతున్నాయి. అక్రమ మైనింగ్‌ను సత్వరమే నిలుపుదల చేసేలా, అలాగే అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు పాల్పడుతున్నవారిని కఠినంగా శిక్షించడం ద్వారా ప్రజాధనాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరుతూ జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం ఆమోదించారు.

- జిల్లాలో అక్రమ మైనింగ్‌ను అరికట్టాలని జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించారు.
- ప్రస్తుతం 500 జనాభా పైబడిన గ్రామాలకే రోడ్డు కనెక్టివిటీ కల్పిస్తున్నారని, 250 జనాభా పైబడిన గ్రామాలకు సైతం కనెక్టివిటీ కల్పించే విధంగా పీఎంజీఎస్‌వై-4 మార్గదర్శకాలను సవరించాలంటూ ప్రభుత్వాన్ని కోరుతూ మరో తీర్మానాన్ని ఏకగ్రీవంగా జెడ్పీ సర్వసభ్య సమావేశం ఆమోదించింది.

న్యూస్‌రీల్

25లోపు భూ ఆధార్ చేయించుకోవాలి

కడప అగ్రికల్చర్: వ్యవసాయ పథకాల్లో సరైన లబ్ధిదారులను గుర్తించి పథకాలు వర్తింప చేసేందుకు కొత్తగా భూ ఆధార్/ఫార్మర్ రిజిస్ట్రీ అనే కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చాయని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు తెలిపారు. భూమి ఉన్న ప్రతి రైతు తప్పకుండా భూ ఆధార్ చేయించుకోవాలని సూచించారు. ఈ భూ ఆధార్ ఉన్న వాళ్లకు పీఎం కిసాన్‌వంటి పథకాలు వర్తింప చేస్తారని తెలిపారు. భూమి ఉన్న ప్రతి రైతు ఈ నెల 25వ తేదీలోగా నమోదు చేసుకోవాలని తెలిపారు.

10న గీత కులాల కోసం మద్యం షాపుల కేటాయింపు



కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 10న గీత కులాల మద్యం దుకాణాలకు లాటరీ కలెక్టరేట్ సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండ్ రవి కుమార్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని ప్రకాశ్ నగర్‌లోని ఎక్సైజ్ సూపరింటెండ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రక్రియలో మొత్తం 14 మద్యం షాపులు విజయవంతమైన దరఖాస్తుదారులకు కేటాయించబడతాయన్నారు. లాటరీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రస్తుత ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించబడుతుందన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఈ కింద తెలపబడిన పత్రాలను తీసుకురావాలన్నారు. అభ్యర్థులు దరఖాస్తు ప్రతుల పూర్తి వివరాలు నాన్-రిఫండబుల్ దరఖాస్తు రుసుం చలాన్. లావాదేవీ పూర్తైన నిర్ధారణగా. ఎంట్రీ పాస్, లాటరీ హాల్‌లో ప్రవేశించేందుకు అవసరమైన పాస్ తీసుకురావాలన్నారు. ఆధార్ కార్డు – గుర్తింపు నిమిత్తం, పాన్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, తహసీల్దార్ లు జారీ చేసిన అదనపు (సప్లిమెంటరీ) ఉప కుల ధవీకరణ పత్రం తీసుకురావాలన్నారు. అభ్యర్థులు ఉదయం 8:00 గంటల లోపు సభాభవన్‌లో హాజరుకావాలన్నారు.

న్యాయమూర్తి పర్యటనలో ప్రొటోకాల్ ఉల్లంఘన

- అంబులెన్స్, ఫైర్ వెహికల్ పెట్టలేదు
- మెటల్ డిక్టెటర్లు అసలు లేవు
- ఒక సీఐ, ఇద్దరు లేక ముగ్గురు ఎస్‌ఐల భద్రత



గవర్నర్ బంగ్లాలోకి వెళ్తున్న సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, పక్కన న్యాయమూర్తులు


బి.కొత్తకోట: రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పర్యటనలో ఉండాల్సిన భద్రత, అమలు చేయాల్సిన నిబంధనల విషయంలో ప్రభుత్వం విఫలమైంది. అధికారిక పర్యటనలో భాగంగా రెండు రోజులుగా అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై విడిది చేసిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పర్యటనలో కనీస ప్రొటోకాల్ పాటించకపోవడంపై అధికార వర్గాల్లో విస్తృత చర్చ జరిగింది. అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని మదనపల్లి, పలమనేరుల్లో నూతన కోర్టు భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరిగాయి. దీనికోసం సీజే శుక్రవారం రాత్రి ఏడు గంటలకు హార్సిలీహిల్స్ చేరుకున్నారు. శనివారం ఉదయం ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో హాజరయ్యేందుకు వెళ్లి సాయంత్రం తిరిగి హార్సిలీహిల్స్ చేరుకున్నారు. అయితే సీజే విషయంలో ప్రభుత్వం కనీస ఏర్పాట్లు చేయలేదు. భద్రత కోసం సీజే విడిది చేసిన గవర్నర్ బంగ్లా వద్ద మెటల్ డిక్టేటర్లు ఏర్పాటు చేయకపోగా అత్యవసర వైద్యం కోసం అందుబాటులో ఉండాల్సిన అంబులెన్స్, వైద్యులు లేరు. హార్సిలీహిల్స్‌పై విధులు నిర్వహిస్తున్న స్టాఫ్‌నర్సు మాత్రమే అందుబాటులో ఉన్నారు. అత్యవసర వైద్యం అవసరమైతే 34 కిలోమీటర్ల దూరంలోని మదనపల్లికి వెళ్లాలి. అలాగే ఏదైనా అనుకోని ప్రమాదాలు సంభవిస్తే.. తక్షణం స్పందించేలా అగ్నిమాపక కేంద్రం అందుబాటులో పెట్టాలి. అయినప్పటికీ అగ్నిమాపక వాహనం కనిపించలేదు. హార్సిలీహిల్స్‌పై కట్టుదిట్టమైన భద్రత కనిపించలేదు. బి.కొత్తకోట సీఐ, ఇద్దరు లేక ముగ్గురు ఎస్‌ఐలు, సిబ్బంది మాత్రమే విధుల్లో ఉన్నారు. కాగా సీజే పర్యటనలో అంబులెన్స్ అందుబాటులో లేని విషయం అధికార వర్గాల్లో జరిగిన చర్చ విషయం శనివారం రాత్రి అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ దృష్టికి వెళ్లగా ఆయన స్పందించారు. కలెక్టర్ సీసీ వైద్యారోగ్యశాఖ జిల్లా అధికారి కొండయ్య దృష్టికి తీసుకెళ్లడంతో.. అనారోగ్యంతో సెలవులో ఉన్న ఆయన రాత్రి 8 గంటలకు స్పందిస్తూ ఒక లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌ను సీజేకు పర్యటనకు పంపాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ శైలజకు సూచించారు. దీనిపై ఆమె 108 జిల్లా అధికారికి ఆదేశాలు జారీ చేయగా కలకడ పీహెచ్‌సీకి చెందిన 108 అంబులెన్స్‌ను పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

హార్సిలీహిల్స్ అందాలు తిలకించిన సీజే

రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ శుక్రవారం రాత్రి హార్సిలీహిల్స్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు జేసీ ఆదర్శ్‌రాజేంద్ర, మదనపల్లి సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, పలువురు న్యాయమూర్తులు సాదర స్వాగతం పలికారు. గవర్నర్ బంగ్లాలో విడిది చేసిన ఆయన రాత్రి కొండపై ప్రకృతి అందాలను తిలకించారు. శనివారం ఉదయం మదనపల్లి, పలమనేరులో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని, తిరిగి సాయంత్రం హార్సిలీహిల్స్ చేరుకున్నారు.

ముందే వచ్చిన మధురఫలం

- మార్కెట్‌లో విక్రయాలు ప్రారంభం
- లాల్ బహార్ రకం టన్ను రూ.60 వేలు
- ఇతర రాష్ట్రాల వ్యాపారుల రాక



ఎగుమతి కోసం ట్రేలో సిద్ధం చేస్తున్న లాల్ బహార్ మామిడి కాయలు

రాయచోటి: మే నెలలో రావాల్సిన మామిడి పండ్లు ముందుగానే వచ్చేశాయి. మామిడి పండ్లను మధుర ఫలం అని కూడా పిలుస్తుంటారు. సాధారణంగా ఈ పండ్లను ఇష్టపడని వారుండరు. ఇవి సీజన్ కన్నా ముందే రావడంతో.. కొనేందుకు అమితాసక్తి చూపుతున్నారు. వాతావరణంలో తలెత్తిన మార్పులు, పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో సీజన్‌తో సంబంధం లేకుండా పండిస్తున్నారు. ఈ క్రమంలో మార్కెట్‌లోకి లాల్ బహార్ రకం మామిడి కాయలు వచ్చేశాయి. వీటిని కొనుగోలు చేసేందుకు బెంగళూరు, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు జిల్లాలో అడుగుపెట్టారు. గత రెండు పర్యాయాలుగా మామిడికి తగిన ధరలు లేక రైతులు, వ్యాపారులు నష్టాలను చవిచూశారు. ఈ ఏడాది తొలి దశలోనే వ్యాపారులు కొనుగోళ్ల కోసం రావడం కాస్త ఊరట ఇచ్చే అంశంగా చెబుతున్నారు.

విదేశాలకు సైతం ఎగుమతి

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 33 వేల హెక్టార్లకుపైగా మామిడి తోటలు సాగులో ఉన్నాయి. వీటిలో మేలెన్నిక, సువాసన, మధురమైన, రుచికరమైన రకరకాల మామిడి పండ్లను రైతులు పండిస్తున్నారు. వారి నుంచి కొనుగోలు చేసి పక్క రాష్ట్రాలు, విదేశాలకు తరలించేందుకు జిల్లాలో మూడు రోజులుగా తోటల్లో చెట్ల నుంచి కాయలు తెంపుతున్నారు. తొలి రోజే టేబుల్ వెరైటీలైన లాల్ బహార్ రకం టన్ను రూ.60 వేల వరకు ధర పలికింది. రాయచోటి, పీలేరు, రైల్వేకోడూరు ప్రాంతాల్లో మామిడి రకాలు ఒక్కొక్కటిగా అందుబాటులోకి వస్తున్నాయి. రానున్న రోజుల్లో కూడా ఇవే ధరలు కొనసాగితే రైతులు, వ్యాపారులు పంట పండినట్లేనని చెబుతున్నారు.

సమాజాన్ని ప్రతిబింబిస్తేనే సాహిత్యానికి మనుగడ

- ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్
- ఘనంగా ప్రారంభమైన వైఎస్సార్ జిల్లా రచయితల సభలు
- విజయవంతంగా పుస్తకావిష్కరణలు, పత్ర సమర్పణలు
- నేడు రెండవరోజు ముగింపు కార్యక్రమాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మండలి బుద్ధప్రసాద్



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, సాహిత్య అభిమానులు

కడప కల్చరల్: సమాజాన్ని ప్రతిబింబించినపుడే సాహిత్యానికి మనుగడ ఉంటుందని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. కడప నగరం శంకరాపురంలోని ఐఎంఏ హాల్లో వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో 'వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం – రాయలసీమ భాగస్వామ్యం' అనే శీర్షికతో 2వ సాహిత్య, సాంస్కృతిక మహాసభలు 'సాహితీ సమరాంగణ సార్వభౌమ' శ్రీకృష్ణదేవరాయుల సభావేదికపై నిర్వహించారు. ప్రారంభ సభకు ముఖ్య అతిథిగా హాజరైన మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తొలి తెలుగు శాసనం ఈ జిల్లాలో లభించడం తెలుగు వారందరికీ గర్వకారణమని, భాష విషయంగా జిల్లా ప్రత్యేకతను చాటుతోందని అన్నారు. తెలుగులో 32 వేల కీర్తనలు రాసిన ఘనత మన అన్నమయ్యదేనని, అందులోని పద సంపదను కాపాడుకుని విస్తృతంగా ప్రయోగంలో పెడితే తెలుగు చిరకాలం మన్నగలదన్నారు. ఈ జిల్లాలో కొత్తగా రచయితల సంఘం ఏర్పడటం శుభపరిణామమన్నారు.

- సభాధ్యక్షులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ రచయితలు ధైర్యంగా సమాజంలో ఉన్నటువంటి లోపాలను ఎత్తిచూపేలా రచనలు చేయాలన్నారు. వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి స్వాగతోపన్యాసంలో సంఘం ఏర్పాటు, వికాసం గురించి తెలియజేశారు. రాష్ట్ర మహాసభలను నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. సినీ నటుడు శివకృష్ణ మాట్లాడుతూ కవులకు, కళాకారులకు రాయలసీమ పెట్టింది పేరన్నారు.
- విశిష్ట అతిథి, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు శలాక రఘునాథ శర్మ మాట్లాడుతూ నేటి కవులు చరిత్ర, సంస్కృతి, భాషను మరవకూడదన్నారు. సీనియర్ రచయిత షేక్ హుసేన్ సత్యాగ్ని వృద్ధాప్యం వల్ల మాట్లాడేందుకు ఇబ్బంది పడినా ఆ వెంటనే తేరుకుని శివ తాండవాన్ని ఉత్సాహంగా గానం చేశారు.
- విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, విద్యావేత్త పిచ్చయ్య చౌదరి మాట్లాడారు. జింకా సుబ్రహ్మణ్యం కార్యదర్శి నివేదిక సమర్పించారు. సంస్థ ప్రతినిధులు శివారెడ్డి, గోపాలకృష్ణశాస్త్రి, రెడ్డి శేఖర్‌రెడ్డి, వెల్లాల వెంకటేశ్వరచారి, చంద్రశేఖర్ రెడ్డి, జీవీ సాయిప్రసాద్, తుమ్మలూరు సురేష్ బాబు, కోడూరు స్వతంత్ర బాబు, పొదిలి నాగరాజు, తవ్వా వెంకటయ్య, సీమ నలుమూలల నుంచి సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువతి అదృశ్యం

మదనపల్లె : యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ ఎరిషావలి తెలిపారు. పట్టణంలోని బుగ్గ కాలువలో నివసిస్తున్న ఇంటర్మీడియట్ చదువుతున్న యువతి (17), అదృశ్యమైనట్లు తండ్రి వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికంగా వారు నిర్వహిస్తున్న హోమ్ నీడ్స్ దుకాణంలో ఈనెల ఆరో తేదీన తన కుమార్తెను షాపు చూసుకోవలసిందిగా చెప్పి ఇంటికి వెళ్లానన్నారు. అయితే తన కుమార్తె షాపును చూస్తూ ఉండాలని పక్కింటి వారికి చెప్పి, షాపు నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వృద్ధురాలిపై టీడీపీ నాయకుడి దాడి



బాధితురాలిని అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఐ పి.మహేష్

ఓబులవారిపల్లె : భూమికి సంబంధించిన తగాదా కారణంగా బీపీరాచపల్లి గ్రామంలో టీడీపీ నాయకుడు శివశంకర్ నాయుడు వృద్ధురాలు ఎస్.సరస్వతిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఎస్ఐ పి.మహేష్ కుమార్ కథనం మేరకు భూ వివాదానికి సంబంధించి శివశంకర్ నాయుడు, సరస్వతమ్మకు మధ్య గొడవ జరిగింది. దీంతో శివశంకర్ నాయుడు సరస్వతమ్మ తలపై రాయితో బలంగా కొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. బాధితురాలిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అంగన్వాడీ టీచర్ ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న అంగన్వాడీ టీచర్ కవిత

సంబేపల్లె : మండల పరిధిలోని దేవపట్ల గ్రామంలో అంగన్వాడీ టీచర్‌గా పని చేస్తున్న రెడ్డి మల్లు కవిత (48) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సంబేపల్లె పోలీసుల వివరాల మేరకు... దేవపట్ల ఆవులవాండ్లపల్లెకు చెందిన కవిత శనివారం అదే గ్రామంలోని అంగన్వాడీ సెంటర్‌కు విధుల నిమిత్తం వెళ్లింది. కేంద్రంలోని చిన్నారులు భోజనం తర్వాత ఇంటికి వెళ్లిపోయారు. ఈ క్రమంలో అంగన్వాడీ కేంద్రం పైన ఉన్న కడ్డీకి ఉరి వేసుకొని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆర్థిక సమస్యలే ఆత్మహత్యకు కారణమని మృతురాలి బంధువులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంగన్వాడీ కార్యకర్తల యూనియన్ లీడర్‌గా కవిత సంస్థలో మంచి పేరు తెచ్చుకుందని తోటి సిబ్బంది తెలిపారు. విషయం తెలుసుకున్న రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, సంబేపల్లె ఎస్ఐ భక్తవత్సలం సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఎమ్మెల్యే X తెలుగు యువత అధ్యక్షుడు

- లేఅవుట్‌కు మట్టి తరలిస్తున్న లారీలను సీజ్ చేయించిన ఎమ్మెల్యే
- సీజ్ చేసే దమ్ము ఎవరిదంటూ విడిపించుకు వెళ్లిన చినబాబు
- ఇద్దరి పోరులో నలిగిపోయిన వీఆర్వో, రెవెన్యూ అధికారులు
- తలలు పట్టుకుంటున్న తెలుగు తమ్ముళ్లు



ఎమ్మెల్యే, తెలుగుయువత అధ్యక్షుడి మధ్య వివాదానికి కారణమైన మట్టి టిప్పర్



డ్రైవర్‌ను తాళాలు ఇచ్చి వెళ్లాలంటున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



వీఆర్ఓ మునిస్వామినాయక్‌పై ఆగ్రహం వ్యక్తం చేసి తాళాలు తీసుకెళుతున్న చినబాబు

మదనపల్లె : ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు మధ్య వర్గపోరు రోజురోజుకీ పెరిగిపోతోంది. ఒకరిపై ఒకరు పరస్పర ఆరోపణలు చేసుకునే స్థాయి నుంచి ఒకరి వ్యవహారాల్లో మరొకరు జోక్యం చేసుకునే వరకు వెళ్లిపోయారు. ఇద్దరి మధ్య వర్గపోరులో ఎవరికి విలువ ఇవ్వాలో, ఎవరి మాట వినాలో తెలియక నియోజకవర్గంలోని అధికారులు, తెలుగుతమ్ముళ్లు నలిగిపోతున్నారు. శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో భాగంగా మదనపల్లె మండలం సీటీఎంకు వెళ్లిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మార్గమధ్యంలో టిప్పర్లు మట్టి తీసుకుని వెళుతుండటాన్ని గమనించి, లారీలను ఆపి ఎవరివి, ఎక్కడకు వెళుతున్నాయని ప్రశ్నించారు. డ్రైవర్, లారీలు తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబువి అని, సీటీఎం స్పిన్నింగ్ మిల్లులో వేస్తున్న లే అవుట్‌కు మట్టి తోలుతున్నట్లు చెప్పాడు. దీంతో అక్కడికక్కడే ఎమ్మెల్యే షాజహాన్ బాషా, డ్రైవర్‌ను లారీ తాళాలు ఇచ్చేసి వెళ్లిపోవాలని, టిప్పర్ సీజ్ చేశామని చెప్పారు. వీఆర్వోలకు వాటిని అప్పగించాల్సిందిగా స్థానిక టీడీపీ నాయకులను ఆదేశించి వెళ్లిపోయారు. అనంతరం విషయం తెలుసుకున్న తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు...సీటీఎంకు చేరుకుని, తన లారీలను ఆపే దమ్ము ఎవడికి ఉందని సవాల్ విసిరారు. టీడీపీ జెండానుమోసి, ప్రతిపక్షంలో కేసులు పెట్టించుకుని, అప్పులపాలైన తనకు, పార్టీ అధికారంలోకి వచ్చాక కనీస విలువ లేకపోతే, ఇక తామెందుకని... పత్రికల్లో రాయలేని బూతులను ఎమ్మెల్యేపై మాట్లాడుతూ వీరంగం సృష్టించారు. నియోజకవర్గంలోని అసలైన టీడీపీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులు పెడితే సహించేది లేదంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో భయపడిన వీఆర్వోలు సీజ్ చేసిన లారీల తాళాలను చినబాబుకు ఇచ్చేశారు. దీంతో ఎమ్మెల్యే వర్సెస్ చినబాబు పోరులో తెలుగుయువత అధ్యక్షుడిదే పైచేయి అయింది. ఇద్దరు టీడీపీ ప్రధాన నాయకుల మధ్య జరుగుతున్న పోరులో, ఎవరివైపు నిలవాలో, ఎవరికి మద్దతు తెలపాలో తెలియక అధికారులు, తమ్ముళ్లు తలలు పట్టుకుంటున్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అనుచరులు..శ్రీరామ్ చినబాబు బూతుపురాణంపై మాట్లాడుతూ...వీఆర్వోలను తిట్టాడు తప్పితే తమను కాదంటూ సర్దిచెప్పుకుంటున్నారు.

11 షాపులకు 130 దరఖాస్తులు

- రూ. 2.6 కోట్ల ఆదాయం
- 9న పరిశీలన, 10న లక్కీడ్రా

రాయచోటి : అన్నమయ్య జిల్లా పరిధిలో గౌడ్ వర్గానికి కేటాయించిన 11 మద్యం షాపులకు 130 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు. శనివారం షాపులకు దరఖాస్తుల గడువు ముగిసే సమయానికి 130 దరఖాస్తులు అందాయన్నారు. ఈ దరఖాస్తుల ద్వారా రూ. 2.6 కోట్ల మేర ప్రభుత్వానికి ఆదాయం వచ్చిందన్నారు. 9వ తేదీన దరఖాస్తులను పరిశీలించి, పదో తేదీన కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సమక్షంలో లక్కీ డ్రా తీస్తారన్నారు. జిల్లాలో షాపుల వారీగా దరఖాస్తుల వివరాలు ఇలా ఉన్నాయి. రాజంపేట మున్సిపాలిటీ 11, మదనపల్లి మున్సిపాలిటీ 20, రామసముద్రం మండలం 11, వీరబల్లి మండలం 15, బి. కొత్తకోట రూరల్ 15, నిమ్మనపల్లి మండలం 9, తంబళ్లపల్లి మండలం 8, నందలూరు మండలం 6, కలకడ మండలం 15, పీలేరు 3 దరఖాస్తులు అందినట్లు జిల్లా ఎస్ఈ తెలిపారు.

తండ్రిపై బెంగతో తనయుడి ఆత్మహత్య

బి.కొత్తకోట : తండ్రి దూరం కావడం జీర్ణించుకోలేక పోయిన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతం శనివారం బి.కొత్తకోట మండలం తుమ్మనంగుట్ట గ్రామంలో వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. ప్రకాశంజిల్లా కొత్తపట్నం మండలం అల్లూరి గ్రామానికి చెందిన ఆవుల అభిలాష్ (32) రహదారి పనుల నాణ్యత సర్వేయర్‌గా పనిచేస్తున్నాడు. ఇక్కడి జాతీయ రహదారి పనుల్లో ఉంటున్నాడు. ఇతని తండ్రి శ్రీనివాసులు ఆరేడు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో తండ్రి మరణం జీర్ణించుకోలేని అభిలాష్ ఎప్పుడూ తండ్రి గురించి చెబుతూ ఆలోచిస్తూ ఉండేవాడు. తండ్రి శ్రీనివాసులతో అభిలాష్‌కు ఎంతో అనుబంధం ఉండేది. ఈ పరిస్థితుల్లో తుమ్మనంగుట్ట గ్రామంలో కార్మికుల షెడ్డులో తానుంటున్న గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అభిలాష్ తమ్ముడు అనిల్‌కుమార్ శనివారం అన్నతో మాట్లాడేందుకు ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో తోటి కార్మికులకు ఫోన్ చేసి అన్న గురించి వాకబు చేసి గదిలో చూడాలని కోరాడు. కార్మికులు కిటికిలోంచి చూడగా ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెంది ఉండటం గుర్తించారు. సమాచారం అందుకున్న ఏఎస్ఐ బొజ్జీనాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తమ్ముడు అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ముగిసిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలు




విజేతగా నిలిచిన పురుషుల జట్టు

కమలాపురం : స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న వైవీయూ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. వైవీయూ పరిధిలోని 8 కళాశాలల క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో బాల్ బ్యాడ్మింటన్, హ్యాండ్ బాల్, సాఫ్ట్ బాల్ పోటీలు నిర్వహించారు. పోటా పోటీగా సాగిన ఈ క్రీడా పోటీల్లో సాఫ్ట్‌బాల్ పురుషుల విభాగంలో స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాల జట్టు విన్నర్స్‌గా నిలవగా, ఆర్‌సీపీఈ ప్రొద్దుటూరు జట్టు రన్నర్స్‌గా నిలిచింది. మహిళల విభాగంలో వైవీయూ కళాశాల విన్నర్స్‌గా నిలవగా, కమలాపురం సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం కళాశాల రన్నర్స్‌గా నిలిచింది. హ్యాండ్ బాల్ పురుషుల, మహిళల రెండు విభాగాల్లోనూ వైవీయూ కళాశాల జట్లు విన్నర్స్‌గా నిలవగా, ఆర్‌సీపీఈ ప్రొద్దుటూరు జట్లు రన్నర్స్‌గా నిలిచారు. బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో ఎస్‌పీ కళాశాల జమ్మలమడుగు విన్నర్స్‌గా నిలవగా, గవర్నమెంటు డిగ్రీ కళాశాల పీఆర్ పేట జట్టు రన్నర్స్‌గా నిలిచింది. కాగా విజేతలకు బహుమతులు అందజేసిన కళాశాల ఛైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైవీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ క్రీడా కారులు అద్భుత ఆటను ప్రదర్శించారన్నారు. ఓడిన వారు కుంగిపోవద్దని, ఓటమే గెలుపునకు తొలి మెట్టు అన్నారు. గెలవడానికి మరో సారి పోటీ పడాలని సూచించారు. కళాశాలల అధ్యాపక సిబ్బంది, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అగ్నికి మామిడి చెట్లు ఆహుతి

సుండుపల్లె : బీడు పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తులు అంటించిన అగ్నికి పక్కనే ఉన్న గిరిజన రైతుల మామిడి చెట్లు ఆహుతయ్యాయి. మండల పరిధిలోని మడితాడు పంచాయతీ, కొలిమిట్ట బిడికి గ్రామానికి తూర్పు వైపున మామిడి తోటల మధ్యలో ఉన్న బీడు పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో పొలాల్లోని ఎండుగడ్డి కాలుతూ మామిడి తోటల కంచెలకు మంటలు అంటుకున్నాయి. కొలిమిట్టకు చెందిన నాగేశ్వర్ నాయక్‌కు చెందిన మామిడి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. మామిడి తోట కంచె కాలుతున్నట్లు గుర్తించిన రైతులు తనకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి వెళ్లేలోపు పదేళ్లుగా కష్టపడి పెంచుకున్న 47 మామిడి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ మంటలు వ్యాపించి పక్కనే ఉన్న నాన్కే నాయక్ తోటలో 30 చెట్లు కాలిపోయాయని తెలిపాడు.



మంటలకు కాలిన మామిడి చెట్లు

లిఫ్ట్ ఇస్తామంటూ దోపిడీ చేసే నిందితుల అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

జమ్మలమడుగు రూరల్ : రోడ్డు పక్కన ఒంటరిగా వేచి ఉన్న వృద్ధులను లక్ష్యంగా చేసుకుని వారికి లిఫ్ట్ ఇస్తామంటూ బైకుపై ఎక్కించుకుని తీసుకెళ్లి దోపిడీకి పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం సాయంత్రం పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎస్.లింగప్పతో కలసి డీఎస్పీ వెంకటేశ్వరరావు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగుకు చెందిన పొన్నతోట జయరాజ్, ప్రొద్దుటూరుకు చెందిన ఇల్లూరి నాగరాజు, వెంకటరమణలు పలు చోరీ కేసుల్లో నిందితులని తెలిపారు. వారం రోజుల క్రితం పొన్నతోట జయరాజ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మిగిలిన నిందితులు ఇల్లూరి నాగరాజు, వెంకటరమణలు తప్పించుకుని తిరుగుతూ కలమల్ల, యాడికి, గుత్తి, ముద్దనూరు రహదారుల్లో ఒంటరిగా పోతున్న వారిని గుర్తించి బైక్‌లలో లిఫ్ట్ ఇస్తామని మాయ మాటలు చెప్పి గ్రామ శివార్లలోకి తీసుకెళ్తారన్నారు. అక్కడ వారిపై దాడిచేసి వారి వద్ద ఉన్న బంగారు, నగదును దోచుకెళ్లేవారన్నారు. రెండు రోజుల క్రితం జిల్లాలోని పోట్లదుర్తి, ముద్దనూరు ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. దీంతో సీసీ పుటేజీల ద్వారా నిందితులను గుర్తించి శనివారం అరెస్టు చేశామన్నారు. ఇల్లూరి నాగరాజుపై జమ్మలమడుగు పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్, పలు క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఆయన తెలిపారు. కేసును ఛేదించిన సిబ్బందిని ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ రామక్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి, ఈఓపీఆర్‌డీలపై విచారణకు నోటీసు

సిద్దవటం : గ్రామ పంచాయతీలో పనులు పూర్తి చేసినా బిల్లులు చెల్లించని కారణంగా పంచాయతీ కార్యదర్శి, ఈఓపీఆర్‌డీలపై ఈనెల 11వ తేదీన విచారణకు డీపీఓ రాజ్యలక్ష్మి నోటీసులు జారీ చేసినట్లు కూటమి నాయకుడు గంజి సుబ్బరాయుడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండలం లోని మాధవరం-1 గ్రామ పంచాయతీలో 2018-19 సంవత్సరంలో దాదాపు రూ. 4 కోట్ల మేర అభివృద్ధి పనులు జరిగాయన్నారు. రూ. 10 లక్షలు నిధులు ఉన్నా అప్పటి పంచాయతీ కార్యదర్శి శివకుమార్, మాధవరం-1 గ్రామ పంచాయతీకి ప్రత్యేకాధికారిగా ఉన్న ఈఓపీఆర్‌డీ సోమశేఖర్‌రెడ్డిలు బిల్లులు చెల్లించలేదన్నారు. అనంతరం ఈఓపీఆర్‌డీ 2 నెలల్లో రూ. 32 లక్షల నిధులు డ్రా చేశారన్నారు. అప్పట్లో తాను జిల్లా కలెక్టర్‌కు, డీపీఓకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. దీంతో మరోసారి డీపీఓకు ఫిర్యాదు చేయడంతో ఈనెల 11వ తేదీన విచారణ చేసేందుకు నోటీసులు జారీ చేశారన్నారు.

క్రికెటర్ శివకోటికి సన్మానం



శివకోటిని సత్కరిస్తున్న ఏఎస్పీ

నందలూరు : నేపాల్‌లో బోర్డు ఆఫ్ డిజేబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరగనున్న టి-20 వన్డే సిరీస్‌కు భారత జట్టు తరపున ఎంపికైన నందలూరు మండల వాసి ఏలుసూరి శివకోటిని రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే ఘనంగా సత్కరించారు. ఏఎస్పీ మాట్లాడుతూ శివకోటి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, ఎస్ఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వందేళ్ల భారతీయ కథా సంకలనంలో వేంపల్లె షరీఫ్ కథ

వేంపల్లె : భారతదేశంలో గత వందేళ్లలో వచ్చిన వంద ఉత్తమ కథల సంకలనంలో జిల్లా వాసి వేంపల్లె షరీఫ్ రాసిన 'ఒంటి చెయ్యి' అనే కథకు స్థానం దక్కింది. ముంబైలోని ప్రపంచ ప్రఖ్యాత పుస్తక ముద్రణా సంస్థ అలెఫ్ గత వందేళ్ల భారతీయ కథా సాహిత్యంలో వచ్చిన వంద కథలతో వంద భారతీయ కథలు పేరుతో సంకలనాన్ని తీసుకొచ్చింది. కేరళ వాసి అయిన ప్రఖ్యాత కవి, అనువాదకుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ది ఇండియా లిటరెట్ పత్రిక పూర్వ సంపాదకుడు ఏజె థామస్ ఈ సంకలనానికి సంపాదకత్వం వహించారు. ప్రస్తుతం అమెజాన్‌లో అత్యధికంగా అమ్ముడుపోతున్న ఈ పుస్తకంలో ప్రపంచ ప్రసిద్ధ భారతీయ రచయితలైన రవీంద్రనాథ్ ఠాగూర్, ప్రేమ్ చంద్, శరత్ చంద్ర ఛటర్జీ, సుబ్రమణ్య భారతి, కె.ఎం మున్షీ, కువెంపు, ఆర్కే నారాయణ్, ఇస్మాత్ చుగ్తాయ్, కుష్వంత్ సింగ్, సత్యజిత్ రే, మహాశ్వేత దేవి, రస్కిన్ బాండ్, ప్రతిభారే, శశిథరూర్ తదితర ఉద్దండుల కథలు ఉన్నాయి. వీరి సరసన తెలుగు నుంచి చలం, కవన శర్మ, సయ్యద్ సలీం, తురగా జానకీ రాణి, వేంపల్లె షరీఫ్ కథలకు స్థానం కల్పించారు. షరీఫ్ 2015 లో రాసిన 'ఒంటి చెయ్యి' కథను బెంగళూరుకు చెందిన ప్రముఖ అనువాదకుడు ఎన్ఎస్.మూర్తి సిరిప్రిలిడ్ వరల్డ్ పేరుతో ఇంగ్లీషులోకి అనువాదం చేశారు. ప్రస్తుతం తన కథకు ఇంతటి గౌరవం దక్కడంపట్ల షరీఫ్ ఆనందం వ్యక్తం చేశారు.

వివాహిత ఆత్మహత్య

చాపాడు : మండల పరిధిలోని వి.రాజుపాలెం గ్రామంలోని దళితవాడలో శుక్రవారం అర్ధరాత్రి జాకట వరలక్ష్మీ(28) అనే వివాహిత మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. దళితవాడకు చెందిన వరలక్ష్మీ, శ్రీకాంత్ దంపతులకు ముగ్గురు ఆడ పిల్లలు పుట్టారు. అయితే గత కొంత కాలంగా ఆడ పిల్లలు పుట్టారనే కారణంతో శ్రీకాంత్ తన భార్యను వేధిస్తున్నాడని, అనుమానిస్తున్నాడని మనస్థాపం చెందిన వరలక్ష్మీ శుక్రవారం రాత్రి అధికంగా మాత్రలను మింగి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి సున్నా

రాయచోటి అర్బన్ : కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలలు గడిచిపోతున్నా జిల్లాలో జరిగిన అభివృద్ధి శూన్యమని అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ విమర్శించారు. శనివారం ఆయన మున్సిపల్ పరిధిలోని 8,9 వార్డులలో కాంగ్రెస్ పార్టీ నేతలతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయచోటి పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా చీఫ్ సెక్రటరీ అమీర్‌బాషా, రాయచోటి నాయకులు పాల్గొన్నారు.

80 లీటర్ల సారా స్వాధీనం

మదనపల్లె : ఎక్సైజ్ సిబ్బంది తనిఖీల్లో 80 లీటర్ల సారాతో పాటుగా రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్ట్ చేసినట్లు సీఐ భీమలింగ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మదనపల్లె మండలం చంద్రమాకులపల్లె క్రాస్ వద్ద ఎక్సైజ్ సిబ్బంది రూట్‌వాచ్ చేస్తుండగా, ఇద్దరు వ్యక్తులు నాటుసారా రవాణా చేస్తూ కనిపించారన్నారు. వారిలో నల్లగుట్టపల్లె తాండాకు చెందిన బి.రమేష్‌నాయక్(30)ను అరెస్ట్‌చేసి, అతని వద్ద నుంచి 40 లీటర్ల సారా, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో నిందితుడు నల్లగుట్టపల్లెకు చెందిన సురేంద్ర నాయక్, పోలీసులు పట్టుకునేలోపు 40 లీటర్ల నాటుసారా, ద్విచక్రవాహనం వదిలి పారిపోయాడన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా, హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, వీరనయ్య, కానిస్టేబుళ్లు దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గాయపడిన యువకుడి మృతి

రామసముద్రం : తమిళనాడు రోడ్డుప్రమాదంలో గాయపడిన రామసముద్రానికి చెందిన యువకుడు శనివారం వేలూరు ఆస్పత్రిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు..రామసముద్రం కర్ణాలవీధికి చెందిన రామచంద్ర, దేవిల కుమారుడు వేణు(25) తమిళనాడు గుడియాత్తంలోని గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. వారం రోజుల క్రితం విధులు ముగించుకుని ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా, ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వేణు తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం అరకంబాడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పెద్దకుమారుడు మృతి చెందడంతో కుటుంబీకులు, బంధుమిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

గండి కొండపై ఇరుక్కున్న లారీ, ఆర్టీసీ బస్సు



గండి కొండపై ఇరుక్కున్న లారీ, ఆర్టీసీ బస్సు

వల్త్రాయపేట : గండి క్షేత్రం సమీపంలో కొండపై శనివారం సాయంత్రం లారీ, ఆర్టీసీ బస్సు ఇరుక్కుపోయాయి. దీంతో రాయచోటి - వేంపల్లె మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గండి కొండపైన ఉన్న గుండు వద్ద రోడ్డు ఇరుకుగా ఉంది. ఇక్కడ ఎదురెదురుగా వాహనాలు వస్తే పక్కకు తొలగి వెళ్లేందుకు సరిపడా స్థలం లేదు. దీంతో అనేక సందర్భాల్లో ఇలా వాహనాలు ఇరుక్కుని డ్రైవర్లతో పాటు ప్రయాణికులు సైతం ఇబ్బందులు పడ్డారు. అదే పరిస్థితి శనివారం కూడా జరిగింది. సంఘటన స్థలానికి ఆర్కే వ్యాలీ పోలీసులు చేరుకుని ఇరుక్కున్న వాహనాలను తొలగించేందుకు చర్యలు చేపట్టారు.

సర్పంచుల చెక్‌పవర్ రద్దుకు కుట్ర

- 9 నూతన పంచాయతీలపై ఎమ్మెల్యే ఫోకస్
- సర్పంచులకు తెలపకుండా రికార్డుల స్వాధీనం



సీటీఎం-2 పంచాయతీలో రికార్డులు స్వాధీనం చేసుకుంటున్న డీఎల్‌పీఓ నాగరాజు, ఈఓఆర్డీ అబ్దుల్ షుకూర్.(ఫైల్)

మదనపల్లె : గ్రామ స్వరాజ్యసాధన, అభివృద్ధిలో భాగంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన నూతన పంచాయతీలపై కూటమి ప్రభుత్వం కక్ష గట్టింది. మదనపల్లె మండలంలో నూతనంగా ఏర్పాటైన 9 పంచాయతీల్లోనూ వైఎస్సార్‌సీపీ సర్పంచులు అధికారంలో ఉండటంతో ఎమ్మెల్యే వీరిపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో ఆయన ఆదేశించిందే తడవు పంచాయతీ అధికారులు వారిపై కత్తిగట్టి సర్పంచులకు ఉన్న చెక్‌పవర్‌ను రద్దు చేయించేందుకు పావులు కదుపుతున్నారు. పంచాయతీరాజ్ నిబంధనలకు వ్యతిరేకంగా, గ్రామపంచాయతీలో కీలకమైన సర్పంచులకు కనీస సమాచారం లేకుండా పంచాయతీ రికార్డులను విచారణ పేరుతో అక్కడి నుంచి తరలింపు చర్యలకు పాల్పడుతున్నారు. మదనపల్లె మండలంలో నారమాకులతండా, ఈశ్వరమ్మకాలనీ, కొత్త ఇండ్లు, రామాచార్లపల్లె, తట్టివారిపల్లె, సీటీఎం క్రాస్‌రోడ్, దుబ్బిగానిపల్లె, వైఎస్సార్ కాలనీ, కురవంక పంచాయతీలు కొత్తవిగా ఏర్పాటు చేశారు. వీటన్నింటిలోనూ వైఎస్సార్‌సీపీ సర్పంచులే అధికారంలో ఉన్నారు. ఏడునెలల క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఈ పంచాయతీల్లో తమ ఆధిపత్యాన్ని నిలుపుకునే క్రమంలో టీడీపీ నాయకులు పట్టు పెంచేందుకు కసరత్తు మొదలుపెట్టారు. ఆయా పంచాయతీల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు సర్పంచులు చేపడుతుంటే, తనకు చెప్పకుండా, అనుమతి లేకుండా చేయడమేంటనే దురుద్దేశంతో వాటిని అడ్డుకునేందుకు అధికారులను అస్త్రంగా ఉపయోగించారు. ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేకంగా సమావేశమై, 9 పంచాయతీల్లో తన ప్రమేయం లేకుండా ఎలాంటి పనులు చేపట్టవద్దని హుకుం జారీచేశారు. అయితే, చెక్‌పవర్ సర్పంచులకు ఉన్నందున తామేమీ చేయలేమని అధికారులు ఎమ్మెల్యేకు చెప్పారు. దీంతో 2024 నవంబర్ 3న రాయచోటిలో జరిగిన జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశం(డీఆర్సీ)లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మండలంలోని 9 నూతన పంచాయతీల్లో సర్పంచులు చెక్‌పవర్ దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో 9 పంచాయతీలకు సంబంధించిన జమా ఖర్చుల వివరాల నివేదికను వారంలోపు ఇవ్వాలని నవంబర్ 26, 2024న జిల్లా పంచాయతీ అధికారి మెమో జారీ చేశారు. దానిపై డివిజనల్ పంచాయతీ అధికారి డిసెంబర్ 2న పంచాయతీ కార్యదర్శులకు మెమో జారీచేసి, రికార్డులు అప్పజెప్పాలని ఆదేశించారు. అంతేకాకుండా సీటీఎం క్రాస్‌రోడ్ పంచాయతీలో ఆర్టీఐ యాక్ట్ ద్వారా సమాచారం ఇవ్వలేదని తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోటకు చెందిన వ్యక్తి ఫిర్యాదు చేస్తే, డీఎల్‌పీఓ జనవరి 16న బహిరంగ విచారణ జరిపారు. అంతేకాకుండా అన్ని రికార్డులు తాను స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా 9 పంచాయతీల్లోనూ డీఎల్‌పీఓ నాగరాజు రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం సర్పంచులందరితో అధికారులు మధ్యవర్తిత్వం మొదలుపెట్టారు. సర్పంచులు అందరూ ఎమ్మెల్యేను కలిసి, ఆయన తనకు అభ్యంతరం లేదని చెబితే, తాము ఎలాంటి చర్యలకు ఉపక్రమించమని, లేనిపక్షంలో చర్యలు తప్పవని బెదిరింపులకు పాల్పడుతున్నారు. సర్పంచులకు తెలపకుండా గ్రామసచివాలయాల నుంచి తరలించిన రికార్డులు, డీఎల్‌పీఓ కార్యాలయంలో ఉంచుకుంటున్నారు. ఏయే రికార్డులు తీసుకెళుతున్నారో, వాటికి సంబంధించిన సమాచారం సర్పంచులకు తెలపకపోవడంతో, వారు సెక్రటరీలను అడిగితే తమకేమీ తెలియదని తెల్లముఖం వేస్తున్నారు. డివిజనల్ అధికారి అయిన డీఎల్‌పీఓ, మండల అధికారి అయిన ఈఓఆర్డీలను తాము రికార్డులకు సంబంధించి వివరాలు అడగలేమని పంచాయతీ కార్యదర్శులు చేతులెత్తేస్తున్నారు. దీంతో రికార్డుల స్వాధీనం వెనుక పెద్ద కుట్రకోణం దాగుందని సర్పంచులు ఆందోళన చెందుతున్నారు.